# ఈ కథకు ముగింపు లేదు




"చిరంజీవి"

ఒడ్డుమీదికి విసిరేసిన చేపలా కొట్టుకుంటున్నారు పంతులుగారు శ్వాస సన్నగిల్లింది. రెప్పల పై నభస్సు విరిగిపడి నంత బరువు చేరింది. అతి ప్రయాస మీద కాని తెరచుకొనడంలేదు. మలిగిపోనున్న దీపశిఖలా కళ్ళలో కాంతి శాతం చాలామటుకు తరిగిపోయింది. వాటికి అధోముఖంగా అచ్చుగుద్దుకొన్న నలుపుచారలు పంతులుగారి శారీరక అస్తవ్యస్త స్థితిని సంపూర్ణంగా చాటుతున్నాయి. నెరపిన గెడ్డం, అగాధాలు సృష్టించుకొన్న బుగ్గలు, నిక్కపొడుచుకొచ్చిన ఛాతీ ఎముకలు, తేజస్సుని కబళించి పరచుకొన్న చీకటి కళ ఆయన బొందిలో ఎక్కడో అడ్డుపడి కొట్టుకునే ప్రాణానికి ప్రతీకగా నిలిచాయి.

ఓ చేతనత ఉంది. అయితే సంకెళ్ళలో బిగిపిపోయింది. బల

హీనత చేతుల్లో బందీగా నిలిచిన చేతనలో వికృతంగా ధ్వనిస్తూన్న అటు-పోటు. ఓ ప్రాణం నిలిచింది-కాని కాలం చేతల్లో వూగిపోతూ. ఆయుర్దాయం- ఏ నిండు ముత్తైదువు పంతులుగారు పెళ్ళి కొడుకుగా తలవంచి నమస్కరించినపుడు, నిండుగా నూరేళ్ళూ బ్రతకమని శపించిందో, అందు ప్రతిఫలంగా చనిపోయినప్పటికీ ఇంకా మిగిలే వుంది. శ్వాస ఆడుతోంది-కేవలం తోలు తిత్తి వూది తిరిగి, కుంచించుకుపోయినట్టు!

ఆస్పత్రి వరండాలో పంతులుగారు ఉదయాన్నించీ జీవచ్ఛవంలా పడివున్నారు. ఎమర్జన్సీ వార్డులో ఖాళీల్లేక, పనికిరాని వాళ్ళందర్నీ చూసే ఓపిక వైద్యుల్లో కలగక, పంతులుగారు వరండాలో విసిరేసిన ఎంగిలి విస్తరిలా పడివున్నారు. ఆయన తలదగ్గర ఓ చెంబూ, మరో గ్లాసూ సొట్టలుపడి, వంకర్లు తిరిగి ఆయన ప్రారబ్ధాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

ఉదయ సంధ్య ఒళ్ళు విరుచుకొని, రెక్కలు కట్టుకొంటూండగా శంకరం పంతులుగారిని రిక్షాలో పడుకోబెట్టి, లాగుతూ ఆస్పత్రి చేరాడు. అప్పటికింకా వెలుగు దీపాలు నిద్రకుపక్రమించలేదు. ఎమర్జన్సీ వార్డు ముందుగదిలో డాక్టరుగారి వెలుగని దివ్వెలు (కళ్ళు) తలుపులు తెరవనే లేదు. అతడికి ఓ ప్రక్కగా నర్సు ఇంగ్లీష్ దినపత్రికని మొహాన కప్పుకొని విశ్రాంతిని కావలించుకొంది.

ఒకటికి రెండు మార్లు గొంతు చించుకొన్నాడు శంకరం. డాక్టరుగారి నిద్ర చెదరలేదు. 3 వ సారి కాస్త గట్టిగా పిలిచినప్పుడు వెంటనే ఉలికిపడి చూసింది నర్స్. గుమ్మంలోనే పంతులుగారిని భుజాన వేసుకొని కలియుగ భట్టి విక్రమార్కుడిలా నుంచున్న చింపిరి గుడ్డల వాడివైపు ఓ నీచపు చూపు విసిరేసి, మళ్ళీ నిద్రలోకి జారుకొంది. బాధతో వంకర్లు తిరిగిపోతున్న తండ్రి వేదన చూడలేక వెళ్ళి కదిపి లేపాడు డాక్టర్ని.

"ఏమిటి బాధ?" చిరాకుగా ప్రశ్నించాడు డాక్టరు.

"మా నాన్నగారు.... రాత్రి నుంచీ కడుపు నొప్పి...." డాక్టర్ మొహంలో అదాటుగా చేరిన విసుగుని చూసి బెదురుతూ చెప్పాడు శంకరం.

"ఎవరికి...నీకా? మీ నాన్నకా?" రిజిష్టరు పుస్తకం తెరుస్తూ ప్రశ్నించాడు డాక్టరు.

"మా నాన్నగారికేనండీ!"

"పేరు—?"

"సుబ్బారావుగారు."

"వయసు?"

"ఎనభై అయిదేళ్ళుంటాయి."

"జబ్బేవిఁటీ...?

"కడుపులో నొప్పి."

"ఎన్నాళ్ళుగా వుంది?"

"గతపదేండ్ల నుంచీ వుందండీ. అప్పుడప్పుడూ వొచ్చేది. సోడా ఉప్పు, 1, 2 మాత్రలు మింగితే తగ్గిపొయ్యేది. నిన్న అర్థరాత్రినుంచి మరీ ఎక్కువై పోయింది. తెల్లారే సరికి శ్వాస సంధించి పోవడం చూసి ఇక్కడికి తీసుకొచ్చాను."

రాతకోతలు ముగించి, పంతులు గారిని స్ట్రెచర్ మీద పడుకోబెట్టాడు డాక్టరు. అప్పటికి కాని నర్సు నిద్ర మత్తు వదల్లేదు. కాసేపు కడుపునీ, మరికొంత సేపు నాడినీ, అటు తర్వాత కళ్ళనీ, చివర్లో పేషంట్ అవతారాన్నీ పరీక్షించి చూసి, నిర్ల క్ష్యంగా పెదవి విరిచాడు డాక్టరు.

"చూడు మిస్టర్! ఆస్పత్రిలో పడకలు ఖాళీ లేవు. అయిందాకా అటెక్కడైనా పడుకోబెట్టు, ఆ తర్వాత చూద్దాంగాని...."అన్నాడు ఆఖర్లో.

"ఎక్కడ పడుకోబెట్టమన్నా రండీ?" వినయంగా అడిగాడు శంకరం.

"నా నెత్తిమీద!"

విస్తుపోయిన శంకరానికి తండ్రిని భుజానేసుకొని బైటికి నడ వటం మినహా గత్యంతరం లేక పోయింది. పంతులు గారిని వరం డాలో పడుకోబెట్టి కాసేపు దిక్కులు చూశాడు.

ఉండ చుట్టుక పోతున్న పంతులు గారి అవస్థ చూశ్ళేక మళ్ళీ ఓమారు ఎమర్జన్సీ వార్డు వైపుకి పరుగు దీశాడు శంకరం గాభరాగా. లోపల గదిలో డాక్టరు కన్పించలేదు. నర్సు మాత్రం బల్లమీది పుస్తకాలు సర్దుతూ అతన్ని చూసి చిన్నగా నవ్వింది.

"ఏవండీ! మానాన్నగారు.... చాలా ఆయాస పడిపోతున్నారు." ఆశగా--ఆత్రుతగా---ఆందోళనగా చెప్పాడు శంకరం.

"ఆయనకో పడక దొరికినంత వరకూ వైద్యం చేయడానికి కుదరదు. ఇలాంటి సమయాల్లో డబ్బు గురించి బాధ పడకూడదు. అప్పో-సప్పో చెయ్యాలి. ఆయనకో పడక యిప్పించాలి. లేకపోతే అనవస రంగా నిండు ప్రాణాలని బలి యిచ్చు కున్నట్టవుతుంది." గంపెడు సాను భూతి కుమ్మరిస్తూ దేవ రహస్యం ముడి విప్పింది నర్సు.

శంకరానికి యేదీ అర్థంకాక

ఆమె ముహంలోకి చూశాడు. అర్థమైయ్యాక నేల చూపులు చూశాడు. కాళ్ళు రెండూ దుమ్ము కొట్టుకుని ఉన్నాయి.

"ఎంతడబ్బు కావలసివస్తుంది?" అడిగాడు చివర్లో.

"పడకకి పాతిక మాత్రం. అదీ చిన్న డాక్టరుగారిక్కడున్నంత లోపుగా నీవు రాగలిగితేనే. పెద్ద డాక్టరొస్తే మరో పాతిక అధికంగా ఖర్చవుతుంది. త్వరగా వెళ్ళి యేర్పాట్లు చేసుకో."

నర్సు సలహా విన్న మీదట దిక్కు తోచక మళ్ళీ దిక్కులు చూశాడు శంకరం. మసక వెలుతురు క్రమంగా పెరుగుతూ కన్పించింది. పంతులు గారిని అలాగే వొదిలేసి, ఖాళీ గుండెలు చేత్తో తడుముకొంటూ పరుగుదీశాడు....

మిట్ట మధ్యాహ్నం వేళ. ప్రచండభానుడు పిడికెట్లో బంధించి ఆకాశంలోకి విసిరేసిన నిరుద్యోగి గుండెలా మండి పడుతున్నాడు. రశ్మికి వేడెక్కిన గాలులు పంతులు గారి శ్వాసల్లో చేరి మరింతగా ఉడుకెత్తుతున్నాయి. ఆవేళ తెలిసిన ప్రతి గుమ్మంలోనూ కాలుమోపి, పరిచయం వున్న ప్రతి ముహాన్నీ యాచించి అస్పత్రికి తిరిగి వచ్చాడు శంకరం. ఉదయం బ్రహ్మోపదేశం గావించిన నర్సుకాని, పాతిక రూపాయలకి ప్రభుత్వాసుపత్రి పడకలమ్మే డాక్టరు కాని కనిపించలేదతనికి. ఓ కొత్త ముహం తెల్లకోటు తొడిగి దర్శన మిచ్చింది. మరో కొత్త అమ్మడు చిరునగవు చిమ్మింది.

ఎలాగైతేనేమి, ముడుపు చెల్లించి, చేతులెత్తి నమస్కరించి పాదాలంటి ప్రాకులాడి, చివరికి పంతులుగారికో పడకని సంపాదించాడు శంకరం!

*  *  *

పంతులుగారి పరిస్థితి పూర్తిగా విషమించింది.

పడక దొరికిందన్న మాటేకాని, పంతులుగారిని పరీక్షించి పాపం మూట కట్టుకోడానికి యే డాక్టరూ ముందుకు రాలేదు. మంచం మీద నల్లిలా కరచుకొని పడి వున్నాడాయన. కడుపులో విపరీతంగా నెప్పొచ్చింది. కాళ్ళు, చేతులుచలనం మానేశాయి. రక్తపుపోటు హెచ్చి, గుండె గమనం దశ మారింది. శరీరంలో నీరు పెరిగి వాతంయేర్పడింది. కనురెప్పలు వాచిపోయాయి. నాలుక మందం పెరిగింది. అయినా ఈ దశలో కూడ యే డాక్టరుకీ తీరిక కలగలేదు. రోగిని చూడాలన్న వూసు పుట్టలేదు.

మంచమ్మీద పంతులుగారు చావుకేకలు పెట్టారు.

పంతులుగారు చేయిదాటి పోయినపుడు మాత్రం శంకరం సహించలేక పోయాడు. రక్తం వుడికిపోయింది. మంచమ్మీద పడి పీక తెగకోసిన కోడిపుంజులా తండ్రి కొస ప్రాణంతో కొట్టు మిట్టాడుతున్నపుడు, చూళ్ళేక పిడికిళ్ళు బిగించి బైద్లేరాడు. "ఇది అన్యాయం...." గర్జించాడు శంకరం డాక్టర్ గదిలోకి అడుగు పెడుతూ.

ఆ ముఖం శంకరానికి అంతకు ముందు నుంచీ తెలుసు. అప్పుడతను తనలాంటి పరిస్థితుల్లోనే ఉన్నాడు. తనకంటే హీనమైన జీవితం గడిపాడు.

"ఇది కోర్టు కాదు న్యాయాన్యాయాలు విచారించి తీర్పు చెప్పడానికి. ఇక్కడ నేరాలు కాదు, రోగాల గురించి వింటారు." అతని గర్జింపు విని తనూ అదే ధోరణిలో జవాబిచ్చాడు చీఫ్ డాక్టర్ చలపతి రావు.

"చావు బ్రతుకుల్లో ఉన్నపుడైనా రోగిని పరీక్షించ లేకపోతే యింత పెద్దప్రభుత్వాసుపత్రి వుండి లాభమేమిటి?"

"ప్రతి రోగి యిక్కడ చావటానికో, బ్రతకటానికో వస్తాడు. చావు-బ్రతుకులు యిక్కడ రాత్రి-పగలు వంటివి. పొడిచే సూర్యుణ్ణీ పెరిగే చీకట్లనీ ఎవ్వరూ ఆపలేరు."

డాక్టరు వేదాంతం శంకరం గుండెల్లో మంటలు రేపింది."

"డాక్టర్! మా నాన్న చావు బ్రతుకుల్లో కొట్టుకుంటున్నాడు. వారం రోజులుగా యిక్కడే పడి వున్నా, యే వొక్క పూటైనా ఆవగింజంత మందుకు నోచుకోలేదాయన."

"ఒక్క మీ నాన్నే కాదు. ఏ రోగికీ ఆస్పత్రిలో మందులు లేవు. అందుకు బాధ్యుణ్ణి నేను కాదు."

"డాక్టర్! ఈ చివరి క్షణాల్లో అయినా ఆయన పట్ల దయ చూపండి.ప్లీజ్...డూ సమ్ థింగ్"

మురికిపట్టి, దుమ్ము కొట్టుకున్న నోటి నుంచి అదాటుగా దొర్లిన పరభాషా పదాలు విని, విస్తుపోయాడు డాక్టర్ చలపతిరావు.

"ఎంతవరకు చదువుకున్నావ్" వెంటనే ప్రశ్నించాడు.

"ఎస్సెల్సీ వరకు...."

"ఊఁ...చదువుకున్నావు. కాని లాభం ఏమిటి? ఇది ప్రభుత్వాసుపత్రి.

"యుకెన్ గెపిట్ ఈజీలీ. ఎన్ని పత్రికల్లో చదవడం లేదు, ఆస్పత్రులన్నీ కన్నీళ్ళు తుడవటా

వికే కాని కష్టాలు కడతేర్చటానికి కాదని."

"డాక్టర్‌గారూ! యేదో వొకటి చేయండి. ఆయన బాధతో నలిగి పోతున్నాడు." రెండు చేతులూ జోడించాడు శంకరం.

డాక్టర్ చలపతిరావు ఓ పొడ వాటి శ్వాస పీల్చాడు—"మీ నాన్నకి ఆపరేషన్ చెయ్యాలి. అప్పుడు కాని ఆయన్ని బ్రతికిం చడం సాధ్యం కాదు."

"నా కభ్యంతరం లేదు. ఆప రేషనే కానివ్వండి. ఆయన ఆరో గ్యం కుదుట పడితే అదే చాలు."

"ఆపరేషన్ చేయడానికి నా ఫీజు ఐదువందలు. నువ్వేదో పేద వాడిలాగున్నావు. కాబట్టి మూడొం దలకి తగ్గించుకుంటాను. ఆయన వొంట్లో రక్తం లేదు. ఆస్పత్రిలో అయితే చవగ్గా దొరుకుతుంది. బైటి నుంచి కొనడానికి నీ వంటి వాళ్ళకి సాధ్యం కాదు. రేపటికంతా అన్ని యేర్పాట్లు పూర్తి చెయ్యాలి."

శంకరం కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. వొణుకుతున్న చేతులు రెంటినీ దగ్గరికి చేర్చి, నోట మాట రాక డాక్టరు పాదాల మీద వాలి పోయాడు. స్టాక్ రిజిష్టర్లో మందుల తాలూకు వివరాలు లిఖిస్తున్న డాక్టర్ చలపతిరావు పురుగును చూసినట్టు నీచంగా చూశాడు అతని వైపు. తీరికలేని వేళ అతనలా వ్యర్థ ప్రయాసతో కాలాన్ని వృథా చేయడం విసుగు కలిగించింది.

డాక్టరు కాళ్ళమీద వాలిపోయాక భోరున యేడ్చేశాడు శంకరం!

* * *

శ్వాస తెగింది!

ప్రతీచి వాడిలో సూర్యుడు అస్తమించాడు.

ఓ చేతనత ముగిసింది. ఎనభై అయిదేండ్ల పాటు అవిరామంగా కొట్టుకొన్న గుండెలు అవిసి పోయాయి. కళ్ళలోని కాంతి కిర ణాలు చీకటి రేఖల్లో కలిసి పోయాయి. వళ్ళు చల్లబడింది.

చావు కేక వినిపించలేదు. శ్వాసల రొద శబ్దించలేదు. మనసు ఆటు-పోటు ధ్వనించ లేదు. గుండెలు లోపలే పగిలి పోయాయి. శిథిలాల్లోంచి ఆత్మ పక్షి గాయా లతో ఎగిరి పోయింది. రక్తం నరాల్లోనే యింకిపోయింది.

వందల కొద్దీ డాక్టర్లని సృష్టిం చిన పంతులుగారు-వేల కొద్దీ జీవి తాలు మలచిన పంతులుగారు-నిర్ జీవం చచ్చి మట్టిమీద పడి వున్నారు. దేశం మామూలుగానే

వుంది. ఎవరికీ పంతులుగారి చావు వార్త తెలియలేదు-ఒక్క శంకరానికి తప్ప. శతకోటి కలంకి ప్రాణం పోసిన పంతులుగారు విరి[illegible]లా కళా విహీనంగా [illegible]

[illegible]ంతులుగారి శవం మీద పడి భోరున యేడ్చాడు శంకరం. కన్నీళ్ళు యింకిపోయి, స్వరంమూగపోయేదాకా విలపించాడు. తండ్రి ఆపరేషన్ కయ్యేఖర్చు పుట్టించుకోలేకపోయిన బాధ వొకవైపు, ఆయన అనుభవించిన యాతనల స్మృతులు మరోవైపు కరిగి నీరై పోయిందాకా ఆక్రోశించాడు. హృదయంలో విజృంభించిన అనంతాగ్ని జ్వాలలభుగభుగలు ఉవ్వెత్తు న నాలుకలు చాపినపుడు ఆవేదన ప్రక్కకి నెట్టి లేచి నుంచున్నాడు.

పంతులుగారి శవాన్ని రెండు చేతుల్లోనూ ఎత్తుకొని ఆస్పత్రి వరండా దాటుతుండగా డాక్టర్ చలపతిరావు యెదురైయ్యాడు. ఆవేళ శంకరం గుండెల్లో కంపం లేదు. పిడికిళ్ళు బిగుసుకోనూ లేదు.

"చలపతీ!" అన్నాడు తగ్గు స్వరంలో.

అవాక్కయి చూశాడు డాక్టర్ చలపతిరావు.

"ఈ శవాన్ని గుర్తించగలవా, చలపతీ?" ప్రశ్నించాడు అదే స్వరంలో.

నిర్లక్ష్యంగా పెదవి విరిచాడు డాక్టర్.

"నీవు గుర్తించలేవు. నీకళ్ళని స్వార్ధపు పొరలు కప్పేశాయి. నీ పాత జ్ఞాపకాలన్నీ నీలో పెరిగిన ఆశాపాశాల బంధనాలు తెంచుకుని దూరంగా పారిపోయాయి. ఒకర్ని గుర్తించే పరిధిని నువ్వెప్పుడో దాటిపోయావు!" శంకరం మాటల్లో ఉద్విగ్నత ధ్వనించింది. క్షణం డాక్టర్ శవాన్ని పరీక్షగా చూశాడు.

"లాభంలేదు, చలపతీ! నువ్వా మహాత్ముణ్ణి గుర్తించలేవు. మనిషి కంటూ వుండాల్సిన ప్రతి అర్హతా కోల్పోయావు. కన్న కొడుకు చదువునైనా లెక్కించకుండా నీ పరీక్ష ఫీజు కట్టిన ఓ మామూలు బడి పంతుల్ని గుర్తించే స్థితిలో లేవు. నువ్వో పేరున్న పెద్ద డాక్టరువి. ప్రతీ ప్రాణానికీ ఓ ఖరీదు కట్టే షరాబువి. నీకళ్ళకు పంతులు గారు ఒక పురుగు లాగే కన్పిస్తారు. ఆయన్ను నువ్వు గుర్తించలేవు."

ముందుకు సాగిపోయాడు శంకరం.

డాక్టర్ చలపతి రావు స్థాణువై నిలుచుండిపోయాడు. అదే క్షణం లో పుట్టిన ఊరూ, చదివిన గుడీ

జ్ఞాపకానికొచ్చాయి. రెక్కలు తెగి మంచాన పడ్డ తల్లి రూపం కళ్ళలో మెదిలింది. స్కూలు ఫైనల్ పరీక్ష ఫీజుకి డబ్బులేక, పూరింటి చీకట్లో పొర్లి పొర్లి యేడ్చినప్పటి కన్నీళ్ళు స్మృతిలో నిలిచాయి. అప్పుడే చల్లగా మాతృప్రేమని మరిపించే అప్యాయతతో తలని స్పృశించిన అమృతహస్తం గుండెను తాకింది. చిరు నవ్వుతో తన స్వార్థాన్ని త్యాగం చేయను సమ్మతించిన శంకరం రూపం స్ఫురించింది. అంత లోనే చీకట్లు కమ్ముకున్నాయి.కష్టాలపై కక్ష సాధించను ముందడుగు వేసిన నాటి చీకట్లు.... దట్టంగా తన చుట్టూ అల్లుకున్న చీకట్లు.

చలపతిరావు ముందుకు పరిగెత్తాడు.

"శంకరం.... ఆగు!" అన్నాడు రొగరుస్తూ.

"ఎందుకూ?" ముందుకు సాగుతూనే ప్రశ్నించాడు శంకరం.

"ఒక్కసారి పంతులు గారి పాదాలు స్పృశించి క్షమాభిక్ష వేడుకోవాలి. ప్లీజ్... ఆగిపో...." డాక్టర్ కళ్ళలో నీరు నిలిచింది.

కాని శంకరం అం...తులుగారి పాదాలు స్పృశించ... అర్హత కోల్పోయిన చలపతి కొరకు ఆగి ఆయనకు ఆత్మశాంతి లేకుండా చేయను మనస్కరించలేదు. జీవితంలో ఎదురు పడ్డ ప్రతి వ్యక్తికీ ఎంతో కొంత సహాయం చేసి ఆయన సముపార్జించుకొన్న పవిత్రతకి కళంకం ఆపాదించేందుకు మనసు సుతరామూ వొప్పుకోలేదు. పంతులు గారిని రిక్షాలో పడుకోబెట్టి లాగుతూ ముందుకు కదలివెళ్ళాడు.

సాగి పోతూన్న శంకరానికి అప్పుడే భూమికలు పైకి తేలి,కళ్ళు అఘాతాల్లో మునిగిపోయిన మహోపంతులు ఆస్పత్రిలో ప్రవేశిస్తూ కన్పించాడు.

దిద్దు... ...శంకరం!

*

Published by K. Rajendra Babu; 80- Dhanalaxmi Colony. Madras- 600 026 and Printed by Vijaya Bapineedu at Vijaya Graphics; 210- Arcot Road, Madras- 600 026. Phone: 422233.
Editor: VIJAYA BAPINEEDU.